క్లుప్తంగా

భోగి పండగకు ఏర్పాట్లు పూర్తి



అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భోగి వేడుకలకు సిద్ధం చేసిన కలప

మునగపాక: మండల వ్యాప్తంగా భోగి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో వేడుకలకు అవసరమైన పందిళ్లు, కలపను సిద్ధం చేశారు. మునగపాకలో అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో భోగి పండగను ఘనంగా జరుపుకోనున్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు



మునగపాకలో కుంగిపోయిన రోడ్డు వద్ద పనులు చేపడుతున్న దృశ్యం

మునగపాక: మునగపాక దరి పూడిమడక రోడ్డులో కుంగిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. కుంగిన రోడ్డు స్థానంలో మెటల్‌ను తీసుకువచ్చి పూడ్చారు. రహదారి అభివృద్ధిలో భాగంగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు లేకుండా ఎస్‌ఐ ప్రసాదరావు చర్యలు తీసుకున్నారు.

కోడి పందెం, పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

రాంబిల్లి(యలమంచిలి): కోడి పందెం, పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. రాంబిల్లి సీఐ సి.హెచ్ నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం దిమిలి, గజరెడ్డి పాలెం గ్రామాల్లో ఆదివారం కోడి పందెం, పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు, 2 పందెం కోళ్లు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే తమకు సమాచారం తెలియజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళ పోలీసులు నిరంతరం గస్తీ తిరుగుతుంటారని ఆయన తెలిపారు.

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో కోడిపందేల శిబిరంపై యలమంచిలి రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. తెరువుపల్లి గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్న సమాచారంతో అక్కడకు వెళ్లిన పోలీసులు ఇద్దరు వ్యక్తుల్ని, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు



సీఐ జి.అప్పన్న, పాయకరావుపేట

పాయకరావుపేట: సంక్రాంతి పండగ నేపథ్యంలో మండలంలో కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి.అప్పన్న తెలిపారు. గ్రామాల్లో, పంట పొలాల్లో, కొబ్బరి తోటల్లో ఎక్కడ నిర్వహించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాములవాకలో జంగిల్ క్లియరెన్స్



పొక్లెయిన్‌తో పనులు చేపడుతున్న దృశ్యం

కోటవురట్ల: పాములవాకలో రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం పలు వీధుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. పొక్లెయిన్‌తో పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను తీయించారు. పండగ నేపథ్యంలో గ్రామం అంతా ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

భోగి భాగ్యాల వేడుకకు సిద్ధం

- పల్లెల్లో సందడే సందడి
- రంగవల్లికలతో ఆకట్టుకుంటున్న లోగిళ్లు
- మార్కెట్లకు సంక్రాంతి శోభ



నక్కపల్లి గురుకుల పాఠశాలలో భోగి మంట వేస్తున్న సిబ్బంది

నక్కపల్లి: సంక్రాంతి అంటే అందరిలోను క్రాంతి నింపే పెద్ద పండగ. కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్లు, డూడూ బసవన్నలు, ఇళ్ల ముందు రంగవల్లులు, పిండి వంటలతో ప్రతి ఇంటా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతాయి. సంక్రాంతి సంబరాలకు శుభారంభం.. తిమిరంపై సమరం.. భోగి పండగ సంరంభం. గజగజ వణికే చలిలో చిమ్మచీకట్లను చీల్చుతూ వెలుగురేఖలు నింపే భోగి మంట చుట్టూ చేరి వెచ్చదనాన్ని ఆస్వాదించం ఓ దివ్యానుభూతి.

భోగి మంటకు ఏర్పాట్లు

యువకులు, చిన్నారులు మూడు రోజులు ముందుగానే ఎక్కడెక్కడి నుంచో చెట్ల నరికి కలప తీసుకు వచ్చి భోగి మంటకు సిద్ధం చేస్తారు. పెద్దలు కూడా ఇంట్లో ఉన్న పాత సామగ్రిని భోగి మంటల్లో వేస్తారు. సూర్యోదయానికి ముందే భోగి మంట వేయడం ఆచారం. దీని వల్ల గ్రామానికి పట్టిన దోషం పోతుందనేది అందరి నమ్మకం. అలాగే రావణుడి చితిగా భావించడం మరికొందరి అభిప్రాయం. అందుకే అందులో పేడతో చేసిన పిడకలు వేయడం రావణునిపై నిరసన తెలియజేయడంగా పెద్దలు చెబుతారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నాలుగు రోజుల ముందే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులతో భోగి మంటలు వేయించడం, రంగవల్లులు తీర్చిదిద్దించి తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. భోగి, సంక్రాంతి పండగల ప్రత్యేకతలను వివరించారు.

బొమ్మల కొలువుకు ప్రత్యేక స్థానం

ఆడపిల్లలు ఇళ్లల్లో చేసే బొమ్మల కొలువు చూడముచ్చటగా ఉంటుంది. తాము ఆడుకున్న బొమ్మలతో పాటు మిత్రుల నుంచి సేకరించిన రంగురంగుల బొమ్మలతో ఇంటిలో ప్రత్యేకంగా అలంకరిస్తారు. వారం రోజుల పాటు ఈ బొమ్మల కొలువులను ఏర్పాటు చేస్తారు.

రంగవల్లులు కనువిందు



భోగి, సంక్రాంతి పండగల సందర్భంగా ఇంటి ముందు ఆకర్షణీయమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. యువతులు, మహిళలు పోటీ పడి మరి లోగిళ్లలో ముగ్గులు వేసి వాకిళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. అలాగే పిండి వంటలతో ఘుమఘుమలాడుతాయి. అల్లుళ్ల రాకతో అత్తారిళ్లు కళకళలాడతాయి. ఉపాధి, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం సంకాంత్రికి సొంతూళ్లకు చేరుకోవడంతో పల్లెలు సందడిగా కనిపిస్తున్నాయి. మార్కెట్లు సైతం రద్దీగా కనిపిస్తున్నాయి.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న యువతులు

గోదా రంగనాథుల పరిణయం

భోగి పండక్కి మరో ప్రత్యేకత ఉంది. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం ఆచరించి శ్రీరంగనాథుని వివాహమాడిన పుణ్యదినం. నెల రోజుల పాటు తను పొందిన అనుభూతిని పాశురం రూపంలో రచించి శ్రీరంగనాథునికి అంకితమిచ్చింది. ఈమె వ్రతదీక్షకు మెచ్చి శ్రీరంగనాథుడు ఆమెను పరిణయమాడటానికి అంగీకరిస్తాడు. ఈ విధంగా ఆయన్ను పొంది భోగం అనుభవించింది కాబట్టి ఈ పర్వదినాన్ని భోగి అంటారని పెద్దలు చెబుతారు.

చిన్నారులకు భోగి పళ్ల సంబరాలు

పిల్లలు నెత్తిన కుటుంబ సభ్యులందరూ భోగిపళ్లు(రేగు పళ్లు) పోసి వారిని ఆశీర్వదించడం ఈ పండగలో మరో సంప్రదాయం. సాయంత్రం పేరంటాళ్లను పిలిచి చిన్నారుల తలపై భోగి పళ్లను పోస్తారు. ఇది కూడా దృష్టి దోషం పోవడానికే. విష్ణుమూర్తికి రేగు పళ్లంటే ఇష్టం. రేగుపళ్లు చిన్నారుల నెత్తిన పోయడం వల్ల విష్ణుమూర్తి ఆశీస్సులు ఉంటాయని ప్రజల నమ్మకం.

భక్తి, జ్ఞానంతోనే భోగం



భక్తి, జ్ఞానం అనేవి భగవంతున్ని పొందే మార్గాలు. ఇవి పొందితే భోగం అనుభవించినట్టే. అందుకే దీనిని భోగి పండగ అని పిలుస్తారని శాస్త్రాలు చెబుతున్నాయి. భోగినాడు ధనుర్మాస వ్రతం ఆచరించి, భగవంతున్ని భర్తగా పొందిన గోదాదేవిని పూజించడం ద్వారా మనసులో అనుకున్న కోరికలు తప్పక నెరవేరుతాయి. గోవుపేడతో చేసిన పిడకలను దండ గుచ్చి భోగిమంటలో వేస్తే దృష్టి దోషంతో పాటు తమకు పట్టిన చీడ పోతుందని నమ్మకం.

– డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవీ, విశ్రాంత తెలుగు పండిట్, నక్కపల్లి

నేటితో ముగియనున్న మేలుకొలుపులు



వాడ్రాపల్లిలో మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా మేలుకొలుపుల ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో భాగంగా ప్రారంభమైన మేలుకొలుపు కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భోగి పండగ రోజున పలు చోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించి మేలుకొలుపును ముగించనున్నారు. మునగపాక, వాడ్రాపల్లి, తదితర గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మాజీ సర్పంచ్ వెంకటరమణ విగ్రహావిష్కరణ

మునగపాక: తిమ్మరాజుపేట గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ శరగడం వెంకటరమణ అందించిన సేవలు మరువలేనివని డీఎల్‌డీవో ఎస్‌టీవో రాజేశ్వరరావు కొనియాడారు. తిమ్మరాజుపేటలో ఆదివారం దివంగత మాజీ సర్పంచ్ వెంకటరమణ విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా పనిచేసి అందరి మన్ననలు అందుకున్న వెంకటరమణ నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. మాజీ ఎంపీపీ ఆడారి మంజు, గ్రామ పెద్దలు భీమరశెట్టి శ్రీనివాసరావు, ఉమాశంకర్, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, బీవీ రమణ, కె.వెంకటప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు లేని ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేయాలి

ఎస్.రాయవరం: సంక్రాంతి సంబరాల్లో పిల్లలు గాలి పటాలు ఎగుర వేసేందుకు విద్యుతు వైర్లు లేని ప్రదేశాలు ఎంచుకోవాలని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సూచించారు. సంక్రాంతికి చిన్నారులు ఎక్కువగా గ్రామాల్లో పతంగులు పండగ చేసుకుంటారని, తల్లి దండ్రులు అప్రమత్తమై జాగ్రత్తలు చెప్పాలన్నారు.

15న జిల్లా స్థాయి గుర్రపు పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాన్‌జిమ్ అధినేత అజయ్, తదితరులు

మునగపాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి గుర్రపు పోటీలు నిర్వహించనున్నట్లు డాన్‌జిమ్ అధినేత పెంటకోట అజయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం జగన్, దాడి అప్పలనాయుడు, వేగి రామకృష్ణ, కర్రి కోటి, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు స్వామి వివేకానంద



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో అంజలి ఘటిస్తున్న విద్యా సంస్థల ప్రతినిధులు, పాఠకులు



పూడిమడకలో వివేకానంద విగ్రహానికి అంజలి ఘటిస్తున్న వాసుపల్లి శ్రీనివాస్, తదితరులు



పెట్టుగోళ్లపల్లిలో వివేకానందుడి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నాయకులు



తోటాడ హైస్కూల్‌లో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం: మార్గదర్శకుడు స్వామి వివేకానంద అని అచ్యుతా కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుడి ప్రసంగాలు భారత్‌కే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. యువతలో ఉత్తేజం వచ్చేలా వివేకానంద ఎంతో మంచి ప్రసంగాలు చేశారని కొనియాడారు. ఉపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ సమాజంలో అజ్ఞానాన్ని చూసి వివేకానందుడు చలించిపోయేవారని, దీనుల పట్ల సానుభూతి కలిగి ఉండాలని అందరికీ పిలుపునిచ్చేవారని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలకు గౌరవ స్థానం ఉండాలని చైతన్యం తీసుకొచ్చిన మహానుభావుడు వివేకానంద అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలం అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు వాసుపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పూడిమడకలో ఆదివారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానంద జయంతి ఉత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వయో వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు సంస్థ అధ్యక్షుడు చోడపల్లి అప్పారావు, కార్యదర్శి మేరుగు అప్పలనాయుడు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి జగన్, మేరుగు నూకరాజు, దాసరి శ్రీను, మేరుగు అప్పలరాజు, ఎరిపల్లి కోదండరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వియ్యపు వరహాలు ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని విగ్రహానికి పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పలువురు పేదలకు 100 కేజీల రేషన్, దుప్పట్లు, వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మాజీ సర్పంచ్ వియ్యపు పోతురాజు, నాయకులు చొప్పా రాజు, కొల్లు సత్యారావు, అల్లు నరసింహాలు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వామి వివేకానందుని విగ్రహానికి 1992–93 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల నాగేశ్వరరావు, అంగులూరి రామకృష్ణ, పొలమరశెట్టి వీరప్పారావు, దాడి జగన్నాథరావు, నరసింగరావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు శివారు ముస్లిం గ్రామంలో ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మత పెద్దలు, జమాత్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భారీ ఊరేగింపు సాగింది. అనంతరం ఖ్వాజా గరీబ్ నవాజ్ నిషాని వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు, జమాత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గరీబ్ నవాజ్ మార్గం అనుసరణీయమని, ఆయన జీవితాన్ని ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. సాయంత్రం ఫాతెహా అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన



గొట్టివాడ ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కోటవురట్ల: గొట్టివాడ, పందూరు ఇసుక రీచ్‌లను అధికారుల బృందం ఆదివారం పరిశీలించింది. ఇసుక తవ్వకాలు, ఇసుక లభ్యతపై తహసీల్దారు తిరుమలబాబు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖాధికారులు పరిశీలన చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖాధికారుల నివేదికను అనుసరించి నదిలో ఇసుక లభ్యత ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం నివేదిక వచ్చాక ఇసుక సరఫరా కోసం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో ఆదివారం పారిశుధ్య పనులు చురుగ్గా సాగాయి. వీధుల్లోని చెత్తను సేకరించి, డ్రైనేజీలు శుభ్రం చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛ గ్రామం కోసం అందరూ సహకరించాలని, తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు.

పాయకరావుపేటలో పండగ రద్దీ



చిత్రమందిర్, గౌతమ్ థియేటర్ సెంటర్ల వద్ద ట్రాఫిక్ రద్దీ

పాయకరావుపేట: సంక్రాంతి పండగ రద్దీ పాయకరావుపేట పట్టణంలో వారం రోజులుగా కనిపిస్తోంది. సంక్రాంతి పండగకు పాఠశాలలకు సెలవులు ప్రకటించడం, దూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు రావడం, షాపింగ్‌లు చేసుకోవడం కారణంగా ప్రజల రాకపోకలు ఎక్కువయ్యాయి. దీంతో పట్టణంలోని ట్రాఫిక్ పెరిగిపోయింది. మెయిన్ రోడ్డులో పలు షాపులకు పార్కింగ్ సక్రమంగా లేకపోవడంతో రోడ్డు పైనే వాహనాలు నిలిపివేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందవుతోంది. వాహనాల రాకపోకలతో చిత్ర మందిర్, గౌతమ్ థియేటర్ సెంటర్ల వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. తాండవ బ్రిడ్జిపై చేపలు అమ్మకాలు యథేచ్ఛగా సాగుతుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక సీఐ జి.అప్పన్నను సంప్రదించగా.. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసులను నియమిస్తున్నట్టు చెప్పారు.

39 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక



సమావేశమైన 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

యలమంచిలి రూరల్: వారంతా 39 ఏళ్ల తర్వాత ఒక్క చోట కలిశారు. తమ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ టెన్త్ బ్యాచ్‌కు చెందిన వారిలో నలుగురి మృతికి సంతాపం తెలిపారు. యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా పట్టణానికి సమీపంలో ఓ మామిడి తోటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాదికి 40 ఏళ్లు పూర్తి కానుండడంతో సమాజ హితానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, రంగా రవి, సుందరపు బాబ్జీ, గణపతి, ఆచాళ్ల వీర, బీజేఆర్ శ్రీను, పీఎస్ తిలక్, నగిరెడ్డి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వయంభూ విఘ్నేశ్వర తీర్థం

కె.కోటపాడు : మల్లంపాలెంలో భోగి పండగను పురస్కరించుకొని సోమవారం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తీర్థం పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాట ప్రదర్శనలు జరపనున్నట్టు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

స్నేహపూర్వకంగా పండగ జరుపుకోవాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ మోహనరావు

గొలుగొండ : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికతో ముందుకెళితే విజయాలు సొంతమవుతాయని డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహనరావు సూచించారు. కృష్ణదేవిపేటలో మైత్రి గ్రంథాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. పోటీ పరీక్షలకు అవసరమైన రూ.15 వేలు విలువైన స్టడీ మెటీరియల్, డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ గ్రూప్స్‌కి సంబంధించిన పుస్తకాలు, రీడింగ్ చైర్స్‌ను గ్రంథాలయానికి అందజేశారు. అంతేకాకుండా తొందరలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.